ప్రజాశక్తి
గురువారం 22 జూన్ 2023

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తదితరులు

కృష్ణాపురం వద్ద నిర్వహిస్తున్న అక్రమ క్వారీ

పొందూరు మండలంలో మైనింగ్ అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. డి-పట్టా భూముల్లో అక్రమంగా క్వారీలను నిర్వహిస్తూ అనుమతులు, నిబంధనలతో తమకు అవసరం లేదనట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరికి అందాల్సిన వాటా వారికి అందుతుండడంతో, ఇక తమకు అడ్డు పడే వారు లేరన్న ధీమాతో యథేచ్ఛగా తవ్వకాలను సాగిస్తూ కొండలను పిండి చేస్తున్నారు. నిపుణుల పర్యవేక్షణలో క్వారీలో చేయాల్సిన పేలుళ్లను కూలీలతోనే చేయించేస్తున్నారు. ఇందుకోసం ప్రమాదకరమైన డైనమైట్స్, జిలిటెన్‌స్టిక్స్, అమ్మోనియా తదితర పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు. పేలుళ్ల సమయంలో ప్రమాదాలు సంభవిస్తే బాధిత కుటుంబాలకు ఎంతో కొంత ముట్టజెప్పి చేతులు దులిపేసుకుంటున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా... ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నా... ప్రభుత్వ యంత్రాంగానికి మాత్రం ఇవేవీ పట్టడం లేదు.

మైనింగ్... మా ఇష్టం

- పొందూరులో చెలరేగిపోతున్న అక్రమార్కులు
- డి-పట్టా భూముల్లో అక్రమ క్వారీల నిర్వహణ
- అనుమతులు లేకున్నా యథేచ్ఛగా తవ్వకాలు
- ప్రమాదకరమైన పేలుడు పదార్థాల వినియోగం
- కన్నెత్తి చూడని అధికార యంత్రాగం

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని రాపాక, ఇల్లయ్యగారిపేట, వావిలపల్లిపేట, కృష్ణాపురం, పుల్లాజీపేట గ్రామాల సమీపంలో నల్లరాతి కొండలు బాగా విస్తరించి ఉన్నాయి. ఈ కొండల్లో క్వారీల నిర్వహణకు మైనింగ్ లీజుల అనుమతితో పాటు క్వారీ పేలుళ్లకు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరి. ఈ అనుమతులేవీ లేకపోయినా యథేచ్ఛగా అక్రమంగా క్వారీలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా రాపాకలోని సర్వే నంబరు 335లో, కృష్ణాపురంలోని సర్వే నంబరు 224లో లీజులు, అనుమతులు లేకుండానే అక్రమంగా మైనింగ్‌ను నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలు నిర్వహిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. పలు శాఖల అధికారులకు అక్రమ క్వారీ నిర్వాహకుల నుంచి నెల వారీ మామూళు అందతుండడంతో, అక్రమ మైనింగ్‌పై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విధానం మారినా మారని పద్ధతి

క్వారీల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతన విధానాన్ని రూపొందించింది. గతంలో లీజులు, సీనరీస్ వంటి వ్యవహారాలను భూగర్భ గనులశాఖ అధికారులు చూసేవారు. మైనింగ్ నిర్వహణలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు విశ్వసముద్ర సంస్థకు కట్టబెట్టింది. ఈ సంస్థ ముందుగానే ప్రభుత్వానికి సీనరీస్ చెల్లించి మైనింగ్ నిర్వహణ కాంట్రాక్టును దక్కించుకుంది.

ఇక్కడి క్వారీ నిర్వాహకులు ప్రభుత్వానికి సీనరీస్‌లు కట్టకుండానే క్వారీలను నిర్వహించేవారు. ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లించాల్సి వస్తుండడంతో అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీస్థాయిలో గండి పడుతున్నా, తమకు రావాల్సిన ఆదాయం వస్తుండడంతో కొందరు అధికారులు తమవంతు సాయం చేస్తున్నారు.

నిపుణులు లేకుండానే పేలుళ్లు

క్వారీల నిర్వహణలో పేలుళ్లు చేయడం సాధారణం. నిబంధనల ప్రకారం క్వారీల్లో పేలుడు పదార్థాలను వినియోగించి చేస్తారు. ఇందుకు తప్పనిసరిగా సంబంధిత శాఖల అనుమతులు అవసరం. అనుమతులు పొందాక నిష్ణాతుల పర్యవేక్షణలో పేలుళ్ల చేయాలి. క్వారీలే అక్రమంగా నిర్వహిస్తుంటే, పేలుళ్లకు అనుమతులు సాధ్యం కాదు కాబట్టి ఎటువంటి భద్రతా పరికరాల్లేకుండా ఇక్కడ పనిచేసే కూలీలతోనే చేయించేస్తున్నారు. పేలుళ్ల సమయంలో ప్రమాదాలు సంభవించి పలువురు మృతి చెందడం, అంగవైకల్యానికి గురైనట్లు తెలుస్తోంది. ఇలాంటి ఘటనల్లో బాధిత కుటుంబాలకు క్వారీ నిర్వాహకులు ఎంతోకొంత ముట్టజెప్పి చేతులు దులిపేసుకుంటున్నారు. విషయాన్ని బయటకు పొక్కకుండా చేయాల్సినవన్నీ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం కళ్లు తెరిచి అక్రమ క్వారీల నిర్వహణపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా అధికారులు కదులుతారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

యోగాతో మానసిక ఉల్లాసం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

యోగాతో మానసిక ఉల్లాసం లభిస్తుందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. మానసిక, శారీరక ఒత్తిళ్లను జయించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని చెప్పారు. ఆయుష్ శాఖ, యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, యువజన సర్వీసుల శాఖ, క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యాన నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో బుధవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చిన్నప్పట్నుంచే యోగాభ్యాసాన్ని అలవాటుగా మార్చుకొని నిరంతర సాధన చేయాలని సూచించారు. నేటి జీవన విధానంలో నిత్యం అధిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నామని, తద్వారా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందన్నారు. ఇటువంటి తరుణంలో యోగా చక్కని పరిష్కారమని చెప్పారు. యోగా వల్ల నూతనోత్తేజం లభిస్తుందని, దీనివల్ల మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. యోగా గురువు సందీప్, చిన్నబాబు, సుధారాణి కార్యక్రమంలో పాల్గొన్న వారితో వివిధ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ, డిఇఒ తిరుమల చైతన్య, డిఎంహెచ్‌ఒ మీనాక్షి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, ఆయుష్ సీనియర్ వైద్యాధికారి పి.జగదీష్, ఉత్తరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిత్య జీవితంలో అంతర్భాగం కావాలి

నిత్య జీవితంలో యోగా అంతర్భాగం కావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టులో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. యోగా గురువు దక్షిణామూర్తి న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు కె.శ్రీదేవి, భాస్కరరావు, ఫణి కుమార్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ, జూనియర్ సివిల్ జడ్జీలు కె.రాణి, డి.భరణి, శారదాంబ శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా తదితరులు

వార్డు వాలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నగరపాలక సంస్థతో పాటు ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మున్సిపాల్టీల పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వాలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో 701 వార్డు వాలంటీర్లకు గానూ తొమ్మిది వాలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆమదాలవలస మున్సిపాల్టీలో నాలుగు, పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో తొమ్మిది, ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో 10 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన స్థానిక అభ్యర్థులు అర్హులని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికన ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

వారం రోజుల్లో స్టాక్ పాయింట్లు

- కొత్తగా ఐదు రీచ్‌లకు ఆమోదం
- జిల్లా అవసరాలకు మొదటి ప్రాధాన్యత
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పలాస, కంచిలిలో స్టాక్ పాయింట్లు వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని జెపి గ్రూపును కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న స్టాక్ పాయింట్లలో ఇసుక అందుబాటులో ఉండాలన్నారు. కొత్తూరు మండలం నివగాం, గార మండలం బూరవల్లి, శ్రీకాకుళం మండలం బట్టేరు, హయాతీనగరం, ఆమదాలవలస మండలం దూసి వద్ద కొత్త రీచ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. పురుషోత్తపురం, ముద్దాడపేట, వెంకటాపురంలో పెండింగ్‌లో ఉన్న సిఎఫ్‌ఒలు క్లియర్ చేసుకోవాలన్నారు. వాల్టా చట్టంలో ఉన్న నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

ఓవర్ లోడులతో ఇసుక తరలింపుపై ఎస్‌పి కలెక్టర్‌కు వివరించగా, కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలైన నాడు- నేడు, హౌసింగ్, ఇతర పనులకు జిల్లాలో ఇసుక అందుబాటులో ఉండాలన్నారు. చవ్వాకులపేట, రామకృష్ణాపురం స్టాక్ పాయింట్ల ఏర్పాటుకు డిఎల్‌ఎస్‌సి ఆమోదించింది. జిల్లాలో స్టాక్ అందుబాటులో ఉండి ఇసుక 24 గంటల్లో సరఫరా చేయాలన్నారు. మొట్టమొదట జిల్లాకే ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, ఇరిగేషన్ ఎస్‌ఇ సుధాకర్, డివిజనల్ మైన్స్ అండ్ జియాలజిస్ట్ ఫణిభూషణ్ రెడ్డి, ఎజి వంశీకుమార్ రెడ్డి, జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి ఎస్.కె సత్యనారాయణ, హౌసింగ్ పీడీ గణపతిరావు, డిఎస్‌పి బాలరాజు, కొత్తూరు, ఆమదాలవలస తహశీల్దార్లు, జెపి గ్రూప్ ప్రతినిధి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సిఆర్‌టిలు

సిఆర్‌టిల నియామకాల్లో అన్యాయం

సమగ్ర శిక్ష కార్యాలయం ఎదుట ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమగ్ర శిక్ష పరిధిలోని కెజిబివి పాఠశాలల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన చేపట్టిన సిఆర్‌టిల నియామకాల్లో అన్ని అర్హతలున్న తమకు అన్యాయం చేస్తున్నారని గంటల ప్రాతిపదికన పనిచేస్తున్న సిఆర్‌టిలు ఆరోపించారు. కొత్త సిఆర్‌టిల నియామకాల్లో భాగంగా సమగ్ర శిక్ష కార్యాలయంలో సర్టిఫికేట్ల వెరిఫికేషన్‌ను బుధవారం చేపట్టారు. ఈ నేపథ్యంలో కార్యాలయం బయట ఆందోళన చేపట్టి నిరసన తెలిపారు. గడిచిన పదేళ్లుగా కెజిబివిల్లో సిఆర్‌టిలుగా, గంటల ప్రాతిపదికన తాత్కాలిక ఉద్యోగాల్లో సేవలందిస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీని గుర్తించకపోవడం అన్యాయమన్నారు. ప్రస్తుత నియామకాల్లో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ప్రైవేటు స్కూళ్లలో పనిచేసిన వారి సీనియార్టీని ప్రాతిపదికగా ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు.

సిఆర్‌టి సీనియార్టీని గుర్తించకపోవడం వెనుక ఆంతర్యమేమిటన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1358 పోస్టులకు జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చారని, అందులో జిల్లావ్యాప్తంగా 15 ప్రిన్సిపాల్స్, 53 సిఆర్‌టి, 80 పిజిటి, రెండు పిఇటి కలుపుకొని 150 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారని చెప్పారు. 1:3 ప్రాతిపదిక 450 మందికి సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌కు అనుమతించారని వివరించారు. మారుమూల ప్రాంతాల్లో సుదీర్ఘకాలం పాటు విద్యాబోధన చేస్తూ అరకొర జీతాలతో పనిచేస్తున్న తమ సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోకుండా, కొత్తగా నియామకాలు చేపట్టడం అన్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి తమకు న్యాయం చేసేలా చూడాలని సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ జయప్రకాష్‌ను కోరారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించాలి

డిఆర్‌ఎంను కోరిన ఎంపీ రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం అర్బన్ : పలాస రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తక్షణమే ప్రారంభించాలని డివిజనల్ రైల్వే మేనేజర్‌ను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. దీనిపై ఇప్పటికే లేఖ రాశానని, ఇటీవలే ఫోన్‌లోనూ సంభాషించినట్లు తెలిపారు. ఈ బ్రిడ్జి ప్రారంభించకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఇచ్ఛాపురం నుంచి పలాస వరకు రైల్వేస్టేషన్లను తనతో కలిసి పర్యటించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని డిఆర్‌ఎం హామీనిచ్చారని తెలిపారు. తాళ్లభద్ర రైల్వే గేటు స్థానంలో ఆర్‌యుబి నిర్మించాలని విన్నవించినట్లు చెప్పారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

శ్రీకాకుళం అర్బన్ : మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ముఖ్యం కాదని, వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అవి పెరిగి పెద్దయ్యేంత వరకు కాపాడుకోవడం ముఖ్యమన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ రహిత శ్రీకాకుళం రూపొందించే దిశగా స్టార్ వాకర్స్ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్టార్‌వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్.జోగినాయుడు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పి.జి గుప్తా, ఆర్.వి ప్రసాద్, బి.వి రవిశంకర్, సింహాద్రి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

ధర్నాలను జయప్రదం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణకు, ఈనెల 30వ తేదీన సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో హనుమంతు ఈశ్వరరావు అధ్యక్షతన బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్, ట్రూ అప్, కస్టమర్ ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారం మోపుతోందని విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు అదనపు ట్రూ అప్ ఛార్జీ పేరుతో ఇప్పుడు వసూలు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. దీనివల్ల గతంలో అద్దెకున్న వాళ్లు వాడుకున్న కరెంట్‌కు ఇప్పుడు అద్దెకు ఉన్న వారు చెల్లించాల్సి వస్తోందన్నారు. పాలకులు, కార్పొరేట్ సంస్థలు కుమ్మక్కై రూ.రెండుకు కొనాల్సిన యూనిట్ విద్యుత్‌ను రూ.12 వరకు కొంటున్నారని విమర్శించారు. ఇటీవలే హిందూజా కంపెనీకి రూ.1200 కోట్ల అదనపు ఛార్జీల పేరుతో ప్రభుత్వం చెల్లించిందన్నారు.

స్మార్ట్ మీటర్ పేరుతో విద్యుత్ రంగాన్ని మొత్తం అదానీకి అప్పగిస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటరు రూ.13 వేలు చొప్పున అదానీతో అగ్రిమెంట్ చేసుకుని పదేళ్ల పాటు నెలకు రూ.120 నుంచి రూ.150 వసూలు చేయడానికి కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రపంచబ్యాంకు షరతులకు తలొగ్గి విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసిందని, ఆ విద్యుత్ సంస్కరణలను వైసిపి ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్తుందని విమర్శించారు.

సర్దుబాటు ఛార్జీల వసూలు నిలిపివేయాలని, విద్యుత్‌రంగ ప్రయివేటీకరణ ప్రభుత్వాలు విరమించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గృహ వినియోగదారులకు వంద యూనిట్ల లోపు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని, విద్యుత్ పంపిణీ సంస్థకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అదానీతో సహా పలు కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న అడ్డగోలు విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలు ప్రజా సంఘాల నాయకులు కొల్లి ఎల్లయ్య, గొండు నీలన్న, బోర శ్రీను, సనపల అప్పన్న, జీరు గురువులు, కాంతారావు, సిహెచ్.వెంకటరావు, పి.ఆనందరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఆయా పోస్టు భర్తీపై వివాదం

మాట్లాడుతున్న దానమ్మ

నౌపడ : సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడుపేట పంచాయతీలో అంగన్వాడీ ఆయా పోస్టు భర్తీపై వివాదం నెలకొంది. స్థానిక సర్పంచ్ భర్త పాల మహేష్‌రెడ్డి రూ.రెండు లక్షలు తీసుకొని తమకు ఉద్యోగం ఇస్తామని నమ్మించి మోసం చేసినట్లు బాధితురాలు లొట్టల దానమ్మ ఆరోపించింది. ఈ మేరకు నౌపడ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆశ్రయించింది. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్ద దానమ్మ విలేకరులతో మాట్లాడారు. అంగన్వాడీ ఆయా పోస్టుకు ముగ్గురు మధ్యవర్తుల సమక్షంలో రూ.రెండు లక్షలు ఇచ్చినట్లు ఆరోపించారు. రెండు విడతలుగా ఇంటర్వ్యూకు ముందు రూ.లక్ష తర్వాత రూ.లక్ష చొప్పున అందించామని తెలిపారు. భారీ మొత్తంలో నగదు తీసుకొని ఉద్యోగం మరొకరికి అమ్ముకున్నారని ఆరోపించారు. తాను అప్పు చేసి ఇచ్చిన సొమ్మునైనా తిరిగి ఇవ్వాలని కోరగా, డబ్బులు తీసుకోలేదని ఏం చేసుకుంటావో చేసుకోమని మహేష్‌రెడ్డి బెదిరిస్తున్నారని బాధితురాలు వాపోయారు. ఈ ఘటనలో ఉన్న ముగ్గురు మధ్యవర్తులు తాము నేరుగా మహేష్ రెడ్డికే రూ.రెండు లక్షలు ఇచ్చామని వెల్లడించారు. నౌపడ పోలీసులకు ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా సర్పంచ్ భర్త పాల మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తాను వైసిపి రెబల్ సర్పంచ్‌గా గెలిచినప్పట్నుంచీ తనను అనవసర వివాదాల్లోకి లాగుతున్నారని ఆరోపించారు. తాను ఎవరి దగ్గర సొమ్ము తీసుకోలేదని, ఆ ఉద్యోగం ఇప్పించేంత అర్హత తనకు లేదని చెప్పారు. గ్రామంలో ఇద్దరు దరఖాస్తు చేసుకోగా, ఒకరు ఎంపికయ్యారని దానిలో తన ప్రమేయం ఏమీ లేదని వెల్లడించారు. తమపై చేస్తున్న ఆరోపణలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఇరువురి ఫిర్యాదులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిషోర్ వర్మ తెలిపారు.

విత్తనాల కొరత రానీయొద్దు

సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - టెక్కలి

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాల కొరత రాకుండా చూడాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఛాంబరులో టెక్కలి డివిజన్ వ్యవసాయశాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాలను సేకరించాలన్నారు. ఈ-క్రాప్ నమోదుపై దృష్టిసారించి రైతులందరూ నమోదయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ-క్రాప్ నమోదు వల్ల పంట నష్ట పరిహారం, ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ రాయితీలు అందుతాయన్న విషయాలను విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. పిఎం కిసాన్-రైతుభరోసా నమోదు చేసుకోని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీకి ఇప్పటికే ఏర్పాట్లు చేశామని, పంపిణీ కూడా ప్రారంభించినట్లు వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ తెలిపారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులనూ రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో టెక్కలి డివిజన్ వ్యవసాయశాఖ అధికారి తిరుమలరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి వారి దివ్య సముఖమునకు

S.O.P. 8/2023

Between:

సింగంశెట్టి శారద ...పిటిషనర్

మరియు:

NIL ...రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు

పై నెంబరు గల పిటిషన్ లో పిటిషనర్స్ సక్షషన్ సర్టిఫికెట్ కొరకు పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినందున సదరు పిటీషన్‌లో ఎవరికైన ఎట్టి అభ్యంతరములున్నచో **తే॥ 25-7-2023 ఉ॥ 10:30 ని॥లకు** పైన తెలిపిన కోర్టు యందు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై తెలియ జేయవలెను. లేనియడల మీ పరొక్షమందు తీర్మానించబడును.

ఇంజరాపు ధనుంజయరావు
అడ్వకేట్,
క్రిష్ణనగర్, నియర్ డి.సి.సి.బి కాలనీ,
శ్రీకాకుళం,
సెల్ : 9247559056.

ఘనంగా యోగా దినోత్సవం

ఎచ్చెర్ల : యోగాసనాలు వేస్తున్న ట్రిపుల్ ఐటి విద్యార్థులు

జి.సిగడాం : యోగా ఆకారంలో ఉన్న విద్యార్థులు

కోటబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు

ఎచ్చెర్ల : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో ట్రిబుల్ ఐటి ప్రొఫెసర్ డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. యోగా వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, శారీరక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగా విభాగపతి ఈశ్వరరావు, యోగా అధ్యాపకురాలు అర్చన మాట్లాడుతూ యోగా కార్యక్రమాలు రోజుల పాటు యూనివర్సిటీలో నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ సల్లా ఆసిరినాయుడు, డిఎస్‌డబ్ల్యు రవి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ముకుందరావు, డిఎఒ రఘుపతిరావు, సాగర్ పాల్గొన్నారు.

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో...

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఆధ్వర్యాన విద్యార్థులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, పీడీలు ఎస్.లక్ష్మణమూర్తి, టి.మురళీమోహన్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక పతంజలి యోగా ఆశ్రమంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సివి ఈశ్వర్‌చంద్ర ప్రసాద, యోగా గురువు జీవన్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్ కుమార్, టౌన్ సర్వేయర్ తవిటినాయుడు పాల్గొన్నారు. అలాగే శాంతి నికేతన విద్యా సంస్థలో చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి, ఎపి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ శివప్రసాదరావు, ఈదుపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.భాస్కర్‌పాడి, వ్యాయామ ఉపాధ్యాయులు పి.శ్రీనివాస, కొలిగి పంచాయతీలో జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ ఆధ్వర్యాన యోగాసనాలు వేయించారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలంలోని దండుగోపాలపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య, యోగా ఇన్‌స్ట్రక్టర్ కృష్ణవేణి, వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపతి, నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భాను ప్రకాష్, సర్పంచ్ ప్రతినిధి పిలకా రవికుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావుల ఆధ్వర్యాన విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి నౌపడ బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. ఉపాధ్యాయులు దాశరథి, గోపాలకృష్ణ, భాస్కరరావు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి మల్ల తేజ చక్రవర్తి ఆధ్వర్యాన న్యాయవాదులు, స్థానిక ఓక్లాండ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఎంఇఒ దాసరి నాగభూషణం, స్కూల్ ప్రిన్సిపాల్ మల్ల మధులత ఆధ్వర్యాన విద్యార్థులు, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్‌కుమార్ అధ్యాపకుల ఆధ్వర్యాన విద్యార్థులు యోగాసనాలు వేశారు.

వజ్రపుకొత్తూరు : ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యాధికారి టి.రమేష్ ఆధ్వర్యాన సిబ్బంది, గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, పాలిన ఉమామహేశ్వరరావు, ఇన్‌ఛార్జి హెచ్ఎంజి లక్ష్మణరావు, పి.పాపారావు, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షకులు, జంతుశాస్త్ర అధ్యాపకులు రమేష్ సాహు విద్యార్థులకు యోగా ఆవశ్యకతను తెలిపి యోగా ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్, అధ్యాపకులు ధనుంజయరావు, చిన్నారావు రామకృష్ణ లైబ్రేరియన్ రామారావు, కృష్ణమూర్తి, వినోద్‌రాజు, శ్రీనివాసరావు, విజయ, గీత పాల్గొన్నారు.

లావేరు : లావేరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు ఆధ్వర్యాన అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో యోగా కన్వీనర్ కోరాడ వాసుదేవరావు, గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

నందిగాం : నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం సమకూరుతుందని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.శివప్రసాద్ ఆధ్వర్యాన నిర్వహించిన యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. మండలంలోని పెద్దతామరపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కె.గున్నయ్య, ఉపాధ్యాయులు బి.శంకరరావు, పి.వనిత, వి.కుమారిలు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

కవిటి: మండలంలోని కరపాడు టోల్ ప్లాజా ఆవరణలో యోగా గురువు సూర్యతేజ ఆధ్వర్యాన సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎఐ పిడి పి.కె.సింగ్, ప్రాజెక్ట్ మేనేజర్ సెంథిల్ కుమార్, వి.వి.కె.వి.ప్రసాద్, ప్లాజా మేనేజర్ జి.వి.రమణ, ఆర్ఇ శివశంకర్‌సాహు పాల్గొన్నారు. బి.జి.బిజిపుట్టుగ హై స్కూల్ వద్ద వ్యాయామ ఉపాధ్యాయుడు బల్లెడ రమేష్, కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో ప్రిన్సిపాల్ బిందుమాధవి, వ్యాయామ ఉపాధ్యాయుడు రాము విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

పోలాకి : మండలంలో ఈదులవలస ఎపి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ ఆధ్వర్యాన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చే వివిధ రకాల యోగా ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: యోగాతో ఆరోగ్యానికి ఎంతో మేలు అని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా గురువులు లగుడు అప్పన్న, లక్ష్మి ఆధ్వర్యాన కోర్టు ఆవరణలో జడ్జి ఎస్.మణి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి, న్యాయవాదులు, సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో యోగా గురువులు అప్పన్న ఆధ్వర్యాన ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎంఇఒ దుప్పల రామారావు, ఎన్‌సిసి చీఫ్ ఆఫీసర్ పి.మోహనరావు, బి.శరత్‌కుమారి, తహాశీల్దార్ మల్లేశ్వరరావు, పీడీ జి.కుమారి, రవి పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో ఉన్న ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అంతర్జాతీయ స్కూల్ డైరెక్టర్ నడుకుదిటి తేజబాబు ఆధ్వర్యాన యోగా ఇన్‌ఛార్జి కుషుబ్ ప్రియ విద్యార్థులకు యోగసనాలు వేయించారు.

జి.సిగడాం : స్థానిక కెజిబివిలో యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఆంగ్ల అక్షరం యోగా ఆకారంలో చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ ఉషారాణి ఆధ్వర్యాన విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అధ్వానంపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అరుణ్ కుమారి ఆధ్వర్యాన విద్యార్థులు యోగాసనాలు వేశారు.

కోటబొమ్మాళి: మండలంలోని ఎత్తురాలుపాడులో ఉపాధి హామీ కూలీలతో, పాఠశాల విద్యార్థులతో ఎపిడి డి.మురళీకృష్ణ యోగా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తనగాన గణపతిరావు, డ్వామా అధికారి సురేష్, ఉపాధి హామీ క్లస్టర్ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎస్ఐసి కార్యాలయం వద్ద మేనేజర్ వెంకటరావు పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యాలయానికి వచ్చే ఏజెంట్లకు, పాలసీదారులకు స్థానిక ఎల్.వి.ప్రసాద్ విజన్ సెంటర్‌లో ఆప్తామెట్రిస్తు దివ్య నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. గిరిజా నర్సింగ్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నిరంజన్ సుగర్ మందులను ఉచితంగా అందజేశారు. ముందుగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

సోంపేట: సోంపేట మోడల్ స్కూల్‌కు చెందిన వెన్నెల, శోభారాణికు రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహకాలను ప్రిన్సిపాల్ చిన్నాజీవర్మ అందజేశారు. ఆర్‌బిఐ ఆర్థిక సమీకృత, అభివృద్ధిలో భాగంగా జాతీయ స్థాయిలో స్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ఈ ఇద్దరు విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. విద్యార్థులు ప్రథమ స్థానం పొందారు.

నందిగాం : మండల రిసోర్స్ కేంద్రంలో లఖిదాసుపురం జిల్లా పరిషత్ విద్యార్థులకు తామరాపల్లి యూనియన్ బ్యాంకు సౌజన్యంతో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో 9వ తరగతి చదువుతున్న బి.హేమంత్, బి.జస్వంత్‌సాయిలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కె.మురళీమోహన్, ఎంఇఒ జి.నరసింహులు, ఎ.చిన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలాస : పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.విశ్వేశ్వరరావు, సూపర్‌డెంట్ పాణిగ్రహీ ఆధ్వర్యాన న్యాయవాదులకు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జిఎంఎస్. అనిల్ రాజు, న్యాయవాదులు తాండ్ర మురళీమోహన్, కోత రజనికుమార్, అహ్మద్ ఘని, బోయిన లక్ష్మి, తేజేశ్వరరావు, నాగు, చిట్టిబాబు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: యోగాసనాలు వేస్తున్న 'ఎన్ఇఆర్' స్కూల్ విద్యార్థులు

టెక్కలి : ఓక్లాండ్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పలాస- -కాశీబుగ్గ క్లబ్ ఆధ్వర్యాన శ్రీవిద్యా వాహిని కళాశాలలో విద్యార్థులతో ఆర్.హేమాచలం యోగాసనలు వేయించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ నెమలిపురి అప్పారావు, కొండలరావు, వీరఘట్టం వెంకటరావు, కళాశాల డైరెక్టర్ పైల తిరుమలరావు, ప్రిన్సిపాల్ గిరిబాబు, ఎఒ మన్మథరావు పాల్గొన్నారు.

జలుమూరు: ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఐ.వి.అప్పారావు, కెజిబివిలో విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఎంఇఒ మ్మిడి మాధవరావు, ఇఒపిఆర్‌డి పి.ఉమామహేశ్వరరావు, సురేష్, ఎపిఎం శ్రీనివాసరావు, ఎఒ దామోదరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో తహాశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, పద్మనాభం పాల్గొన్నారు.

న్యూ సెంట్రల్ స్కూల్లో ..

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని స్థానిక పిఎన్ కాలనీలో గల న్యూ సెంట్రల్ స్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యువ టూరిజం క్లబ్ సభ్యుల ఆధ్వర్యాన పి.వైకుంఠరావు యోగసనాలు వేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వరరావు, డైరెక్టర్ పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, పీడీ ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

మున్సిపల్ మైదానంలో..

యోగా గురువు తంగి స్వాతి ఆధ్వర్యాన నగరంలోని మున్సిపల్ మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో యోగా గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు.

పెరిగిన విద్యుత్ ఛార్జీలపై ప్రజాగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

నరసన్నపేట: పెరిగిన విద్యుత్ ఛార్జీలపై అన్ని తరగతి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని సిఐటియు నాయకులు ఆర్.సురేష్‌బాబు, సిపిఐ సీనియర్ నాయకులు సనపల నర్సింహులు అన్నారు. నరసన్నపేట సౌభాగ్య లక్ష్మి కళ్యాణ మండపంలో పెరిగిన విద్యుత్ ఛార్జీలపై బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నమ్మకద్రోహం చేశారని అన్నారు. పెరిగిన ధరలతో ప్రజా జీవనం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చి వాటిని ఉల్లంగించారన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో విద్యుత్ రంగాన్ని అదానీ, ఇతర కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకు చట్టాలు అమలు చేస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు కాంట్రాక్టు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భారాలపై సాగే పోరాటంలో ప్రజా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, టిడిపి నాయకులు జి.చిట్టి బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.మధుబాబు, ఎన్.నారాయణరావు, ఎన్.మధు పాల్గొన్నారు.

జెవివిలో సభ్యులుగా చేరాలి

లావేరు: శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. మండలంలోని అదపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదికలో చేరండి... శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దాం అనే పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, మెట్టవలస జెడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర నాయకులు వి.సత్యనారాయణ, లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కూన రంగనాయకులు, జెవివి సీనియర్ నాయకులు పి.ఉదయ్‌కుమార్, జి.మురళి, వెంకటాపురం జెడ్‌పిహెచ్ఎస్ హెచ్ఎం కాగాన ముకుందరావు, ఎం.వి.కామేశ్వరరావు, బొడ్డేపల్లి జగన్నాథరావు, బాలకృష్ణ, నాగరాజు, లక్ష్మణరావు, కృష్ణారావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి సభ్యులు

రేపు డిగ్రీ ఆనర్స్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశపెడుతున్న డిగ్రీ ఆనర్స్, సింగిల్ మేజర్ సబ్జెక్టుపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఈ నెల 23న అవగాహనా సదస్సు నిర్వహిస్తున్న కాకినాడ ఆదిత్య డిగ్రీ డైరెక్టర్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి సహకారంతో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ సదస్సులో పాల్గోవాలన్నారు. నాలుగు, మూడేళ్ల డిగ్రీ గురించి తెలుసుకునేందుకు ఈ సదస్సు దోహదపడుతుం దన్నారు. సింగిల్ మేజర్ మైనర్ సబ్జెక్టుల ఎంపికపై అవగాహనతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, మల్టీ డిసిప్లినరీ వంటి కోర్సులపై పట్టు సాధించవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపిడిఒల బాధ్యతల స్వీకరణ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఎంపిడిఒగా ఎం.ఈశ్వరరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన పోలాకి మండలంలో ఇఒపిఆర్‌డిగా విధులు నిర్వహిస్తూ... ఉద్యోగోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇఒపిఆర్‌డిగా పనిచేస్తున్న రామారావు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టారు. ఈశ్వరరావుకు కార్యదర్శులు, సిబ్బంది స్వాగతం పలికారు.

పొందూరు: పొందూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సీపాన హరిహరరావు బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఇటీవల వ్యక్తిగత కారణాల రీత్యా సెలవులో ఉన్న ఈయన మరలా విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పనిచేసిన వి.విశ్వేశ్వరరావు తన పూర్వ లావేరు మండలం ఇఒపిఆర్‌డిగా వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఎంపిడిఒకు కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

భూమి లేని, ఇతర కౌలు రైతులు తాము సాగు చేస్తున్న భూమి కోసం సాగు హక్కులు పొందాలని తహాశీల్దార్ పి.సరోజని అన్నారు. తహాశీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ, వ్యవసాయాధికారులతో కౌలు రైతుల భూ సాగుహక్కు పత్రాలపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులు భూ సాగు హక్కు పత్రాలు పొందేందుకు రైతు భరోసా కేంద్రాల అధికారులు, రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. సాగు హక్కు పత్రాలు ఉంటే రైతు భరోసా, ఈ-పంట నమోదు, ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుతాయని అన్నారు. దీనివల్ల భూ యజమానికి ఎటువంటి నష్టమూ ఉండదని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, వైసిపి మండల పార్టీ అధ్యఓఉలు పల్లి యోగి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహాశీల్దార్ సరోజని

రైతులంటే అంత అలుసా!

ఇరిగేషన్ అధికారుల గైర్హాజరుపై సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతులంటే అంత అలుసా అని కొర్లకోట ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు ఇరిగేషన్ అధికారుల డుమ్మాపై ధ్వజమెత్తారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి తమ్మినేని శారద అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ముందుగా భాస్కరరావు మాట్లాడుతూ మండల పరిషత్‌లో జరిగే సమావేశాలకు ఇంతవరకు నాగావళి వంశధార ఎఇలు హాజరు కాలేదని మండి పడ్డారు. ఓవైపు ఖరీఫ్ సీజన్ మొదలుకానుందని, ఈ సమయంలో సాగునీరుపై ఇరిగేషన్ అధికారులు సలహాలు, సూచనలు అందించాల్సిన తరుణంలో సమావేశాలకు హాజరుకాకుండా ఉండటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రైతుల తరపున సాగునీటి కష్టాలు చెప్పుకుందామంటే వారు సమావేశానికి రాకుంటే ఎలా అని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి సమావేశానికీ హాజరు కాకుండా సాకులు చెబుతుండడం సహేతుకం కాదన్నారు. ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు కలుగజేసుకొని కేసు విషయమై కోర్టుకు హాజరయ్యారని, ఆ విషయాన్ని లేఖ ద్వారా తెలిపారని వివరించారు. గతంలో కూడా కాలువలను రైతులందరితో కలిసి డబ్బులు వేసుకొని బాగు చేసుకున్నామని, ప్రతి సంవత్సరం ఇదే తంతు నడుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నాగావళి వంశధార ఎఇలతో మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిటిసిలతో, సర్పంచ్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపిడిఒ హామీనిచ్చారు. అనంతరం వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు మాట్లాడుతూ మండలంలో 23 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 1500 కింటాళ్ల వరి విత్తనాలను సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకు 1100 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్లు అయ్యాయని తెలిపారు. నాలుగు గ్రామాల్లో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని, త్వరలో అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోనూ మొత్తం విత్తనాలను పంపిణీ చేస్తామని తెలిపారు. సంపత్ స్వర్ణ విత్తనాలను పంపిణీ చేయాలని ఎంపీటీసీలు సర్పంచులు ఏవో ను కోరగా గుర్తింపు పొందిన విత్తనం కాకపోవడంతోనే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం లేదని తెలిపారు. జి.కె.వలస సర్పంచ్ ఫంగ సుగుణ మాట్లాడుతూ తమ గ్రామంలో అనధికారికంగా ఓ వ్యక్తి తన సొంత స్థలంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి అనధికార విద్యుత్‌ను వాడుకుంటున్నారని, దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ నిధులను దుర్వినియోగపరిచి కొన్ని శక్తులు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేసి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని రూరల్ ఎఇ రవికుమార్ తెలపడంతో గొడవ సద్దుమణిగింది. అంగన్వాడీ పిఒ కె.బాలామణి ప్రతి సమావేశానికీ డుమ్మా కొట్టడంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ నూకరాజు మాట్లాడుతూ ఏదైనా సమాచారంపై పిఒను ఫోన్‌లో సంప్రదిస్తే కనీసం మర్యాద కూడా ఇవ్వకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతుందని, ఆఫీసు వేళలో కార్యాలయానికి వచ్చి కలవాలని సమాధానం ఇస్తుందని మండిపడ్డారు. హిందూపురంలో ఉద్యోగం చేయాల్సిన వ్యక్తి డిప్యూటేషన్‌పై ఇక్కడ విధులు నిర్వహిస్తూ... ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. ఆమె వ్యవహార శైలిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిటిసిలు బొడ్డేపల్లి సుగుణ, గొర్లె సూర్యం, పొన్నాడ అనసూయమ్మ, ఎంఇఒ దుప్పల రామారావు, వైద్యులు మెట్ట స్రవంతి, మీనాకుమారి, బాలచందర్, వెటర్నరీ డాక్టర్ హేమలత, ఎపిఎం పైడి కూర్మారావు, ఎపిఒ సురవరపు లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

నిలదీస్తున్న కొర్లకోట ఎంపిటిసి భాస్కరరావు

సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిఎం జగన్మోహన్‌రెడ్డి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన, పథకాలు సంబంధించి స్వయం సంఘాల మహిళతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురపాలక సంఘం కార్యాలయంలో ఆరో వార్డు నుంచి అరుణశ్రీ, స్వేచ్ఛ, రెండో వార్డు నుంచి సాయికిరణ్, శ్రీలక్ష్మి, 13వ వార్డు నుంచి శ్రీరామలక్ష్మి, గాయత్రి ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యులతో మెప్మా ఆధ్వర్యాన ఈ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రూప్ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలే కాకుండా విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకూ అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. విద్యకు సంబంధించి 'నాడు-నేడు'తో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని పేర్కొన్నారు. కార్పొరేట్ స్కూల్ స్థాయిలో తరగతి గదులు ఉన్నాయని అన్నారు. వైద్యం విషయంలో ఆరోగ్యశ్రీ, కొత్తగా అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ప్రవేశపెట్టారని అన్నారు. మరికొద్ది రోజుల్లో ప్రజలకు ఫామిలీ డాక్టర్లు కార్యక్రమం పెడుతున్నామని అన్నారు. వ్యవసాయానికి సంబంధించి రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, అర్‌పిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

పుష్పగుచ్ఛం అందజేస్తున్న శోభారాణి

నూతన క్లబ్ అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో నూతనంగా ఏర్పడి సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని లయన్స్ గవర్నర్ డాక్టర్ ఎ.గోపాలరావు అన్నారు. ఈ మేరకు కార్యాలయాన్ని గోపాలరావు బృందం బుధవారం సందర్శించింది. వారిని లయన్స్ క్లబ్ అధ్యక్షులు కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ (హారికాప్రసాద్) స్వాగతం పలికారు. క్లబ్ నేతృత్వాన జిల్లా కేంద్రంలో డయాలసిస్ యూనిట్‌ను నెలకొల్పనున్నట్లు హారికాప్రసాద్ గోపాలరావుకు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు వావిలపల్లి జగన్నాథనాయుడు, జోనల్ చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, క్లబ్ అధ్యక్షులు లయన్ శోభారాణి, తర్లాడ అప్పలనాయుడు, మధుబాబు, గేదెల బాల గాంధీశ్రీనివాస్, హారిక, గణపతి, నాయుడు పాల్గొన్నారు.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

జి.సిగడాం : మండల కేంద్రంలోని ఎపి మోడల్ స్కూల్‌లో ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు సంబంధించి కొద్దిపాటి మిగిలిన సీట్ల భర్తీకి పరీక్ష ద్వారా చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ అన్న శామ్యూల్ లంక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు పూర్తయిన తర్వాత పరీక్ష తేదీ ప్రకటించి ఫలితాలు ఆధారంగానే మిగిలిన సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు.

రణస్థలం: ఎపి సెకండరీ ఎడ్యుకేషన్ సొసైటీ మోడల్ స్కూల్స్ 2023-24 విద్యా సంవత్సరానికి మండలంలోని కొండములగాం మోడల్ స్కూల్స్‌లో 7, 8, 9, తరగతుల్లో మిగిలిపోయిన ఖాళీలను పూరించడానికి ఆర్డర్స్ దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకుని ఈ నెల 28న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని కోరారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8978615698 సెల్ నంబరును సంప్రదించాలని కోరారు.

శ్యామలరావు మృతదేహం

ట్రాక్టర్ ఢీకొని గెస్ట్ లెక్చరర్ మృతి

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని జలంత్రకోట జాతీయ రహదారి కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం రాజపురం మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ పసుపురెడ్డి శ్యామలరావు (35) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళానికి చెందిన శ్యామలరావు కవిటి మండలం రాజపురం మోడల్ స్కూల్‌లో గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజూ శ్రీకాకుళం నుంచి స్కూటీపై రాజపురం వెళ్లీ వస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం జలంత్రకోట వైపు వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. ఈ సమయంలో స్కూటీ ట్రాక్టర్ ట్రాలీ వెనుక భాగంలో చిక్కుకుంది. ఈ ప్రమాదంలో శ్యామలరావు తలకు బలమైన గాయం కావడంతో ఘటనాస్థలంలోనే మృత్యువాత పడ్డాడు. మృతుడికి వివాహం కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని

శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ బాలరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం గొలుసు చోరీ

మెళియాపుట్టి : మండలంలో పెద్దపద్మపురానికి చెందిన గొట్టిపల్లి నారాయణమ్మ మెడలోని మూడు తులాల బంగారు గొలుసు బుధవారం చోరీకి గురైంది. బందపల్లిలోని తన చెల్లి ఇంటికి వెళ్లి తిరిగి పెద్దపద్మాపురం వెళ్లేందుకు మెళియాపుట్టిలోని గుర్తు తెలియని ఆటో ఎక్కింది. మార్గంమధ్యంలో ఆమె ప్రయాణించే ఆటోలో ఉండే ముగ్గురు మహిళలు నారాయణమ్మకు మాటల్లో కలిపి ఆమె మెడలోని గొలుసును చోరీ చేశారు. ఇంటికి వెళ్లిన తరువాత చూసుకోగా... చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ నర్సింగరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

కవిటి: మండలంలోని కపాసుకుద్దికి చెందిన ఆరుగురు వ్యక్తుల వద్ద ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకున్నారనే ఫిర్యాదు మేరకు సీడాప్ చైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, నర్సీపట్నంకు చెందిన వారాడ మోహనరావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు.కపాసుకుద్దికి చెందిన సంగారు ముకుందరావు, వాసుపల్లి హేమాచలం, బడే రుద్రనేత్ర, బడే సురేష్, సంగారు పాపారావు, గీత కోటేసు అనే వ్యక్తులను స్మార్ట్ విలేజ్ డెవలప్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, నెలకు రూ.25 వేలు జీతమని చెప్పి, ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.3 లక్షలు చొప్పున మొత్తం రూ.18 లక్షలు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, మోహనరావు తీసుకున్నట్లు బాధితుడు సంగారు ముకుందరావు ఫిర్యాదు చేశారని అన్నారు. కానీ, ఇంతవరకు తమకు ఎటువంటి ఉద్యోగము ఇవ్వలేదని, దీంతో తాము ఆర్థికంగా కుదేలైనట్టు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారని అన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

13 మందిపై బైండోవర్ కేసులు

నౌపడ : సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడుపేట పంచాయతీ పోతునాయుడుపేటకు చెందిన 13 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ కిషోర్‌వర్మ తెలిపారు. గ్రామంలోని బేపల ఈశ్వరరావు ఇంటి స్థల వివాదంతో శాంతిభద్రతల రక్షణ దృష్ట్యా ఇరు గ్రూపులకు చెందిన 13 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. పంచాయతీలో కొద్దిరోజులుగా వివాదాలు చలరేగుతున్నాయని, ఈ నేపథ్యంలో ఈశ్వరరావు గ్రూపునకు చెందిన నలుగురు వ్యక్తుల పైన, అలాగే సర్పంచ్ భర్త పాల మహేష్ గ్రూపునకు చెందిన 9 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

పొందూరు : మండలంలోని కింతలి గ్రామం సమీపంలో పేకాట శిబిరంపై దాడి చేసి పది మంది జూదర్లను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. ఇందులో కింతలి, కనిమెట్ట గ్రామాలకు చెందిన పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.35,070 నగదు, 9 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళకు గాయాలు

మెళియాపుట్టి. మండలంలో పెద్దపద్మాపురం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టకోయి గ్రామానికి చెందిన పల్లి చిలకమ్మ గాయపడింది. పెద్దపద్మాపురం నుంచి మెళియాపుట్టి వైపు ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చొని ప్రయాణిస్తుండగా కిందకు జారి పడడంతో గాయపడింది. వెంటనే ఆమెకు వైద్యం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానిస్తున్న నాయకులు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సర్పంచ్ తమ్మినేని మణెమ్మ, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వార గాంధీ, ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య బుధవారం సన్మానించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి బదిలీ అయిన లఖినాన హేమనాచార్యులు, ఉపాధ్యాయులు తమ్మినైన గోవిందరావు, పైడి సరస్వతి, పైడి సునీతలకు దుశ్శాలువలు కప్పి సన్మానించి మెమొంటోలను అందజేశారు. పాఠశాల పేరును జాతీయ, రాష్ట్రస్థాయిల్లో ఘనకీర్తి సాధించే దిశగా కృషి చేశారని కొనియాడారు. అనంతరం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలపేరుతో నగదు ప్రోత్సాహక బహుమతులను, మెడల్‌లను అందజేశారు. 575 మార్కులతో టాపర్‌గా నిలిచిన తమ్మినేని హరీష్‌కు రూ.3 వేలు, 562 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన దొండపాటి రోహిణికి రూ.2 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వండాన శివసాయి, మెట్ట విజయకిరణ్‌లకు రూ.వెయ్యి చొప్పున నగదు అందజేశారు.

పలువురికి ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: కష్టాల్లో ఉన్న తమ స్నేహితురాలను ఆదుకోవాలని పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. బుధవారం నౌపడ ఆర్‌ఎస్‌లోని మణిగం నిర్మల కుటుంబాన్ని కలిసి రూ.31,500 ఆర్థిక సహాయాన్ని అందించారు. గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థి మణిగం నిర్మల భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులు కుటుంబానికి ఆర్థిక సాయం అందించి చేయూత నిచ్చారు. కార్యక్రమంలో మద్దిలి హరినారాయణ, కీలు లోకనాథం, బొడ్డేపల్లి మోహనరావు, కూటికుప్పల శ్రీనివాసరావు, ఏలూరు వెంకటరావు పాల్గొన్నారు.

పొందూరు : మండలంలోని అచ్చిపోలవలసకు చెందిన కేన్సర్ బాధితుడు, ఉపాధ్యాయుడు మర్రి పోలినాయుడుకు శుక్రవారం ఇదే గ్రామానికి చెందిన రచయిత, స్కూల్ అసిస్టెంట్ బొడ్డేపల్లి భూపతిరావు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అనారోగ్యం కారణంగా దీర్ఘకాలిక సెలవులో ఉన్న పోలినాయుడుకు జీతం అందడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దాతలెవరైనా అతని సెల్ 9618382901కు ఫోన్ పే చేయాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

పొందూరు: మండలంలో విద్యాశాఖలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎపిటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి-2 పట్నాన రాజారావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 మాట్లాడుతూ మండలంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈయనను కలిసిన వారిలో మండల ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రమణరావు, డి.శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్ కోరుకొండ విజయ్‌కుమార్, రఘునాయుడు. డి.రవికుమార్, రంగారావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

గృహ నిర్మాణాలు వేగవంతం

పలాస : మండలంలోని అల్లుకోలకు మంజూరైన జగనన్న గృహాలను త్వరలో పూర్తిచేయాలని ఆర్‌డిఒ సీతారామ్మూర్తి అన్నారు. ఈ మేరకు గ్రామంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సర్వే, రిజిస్ట్రేషన్ సచివాలయాల్లో చేసుకోవచ్చునని చెప్పారు. అనంతరం గడపగడపకు కార్యక్రమంలో మంజూరైన నిధుల్లో భాగంగా రూ. 3 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దువ్వాడ వామాక్షి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, మండల పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, డిటి లక్ష్మీనారాయణ, మండల సచివాలయం కన్వీనర్ దువ్వాడ రవికుమార్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ మాధవరావు, పిఆర్ ఎఇ పార్వతి పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ పరిశీలన

సోంపేట: మండలంలోని బి.సి.రామచంద్రపురంలో స్థానిక రైతుల నుంచి సేకరిస్తున్న మట్టి నమూనా సేకరణలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్, ఎడి ఎ.జగన్మోహనరావులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు మట్టి నమూనా సేకరణ కార్యక్రమాన్ని

మట్టి నమూనాలను పరిశీలిస్తున్న అధికారులు

క్విజ్ పోటీలతో మేధాశక్తి

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థులకు ఆర్థిక విషయాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ మిశ్రా అన్నారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా సౌజన్యంతో విద్యార్థుల్లో ఆర్థిక అవగాహనకు సంబంధించి 8, 9, 10 తరగతుల విద్యార్థులకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బుధవారం క్విజ్ పోటీలు బుధవారం నిర్వహించింది. ఈ పోటీల్లో బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉదయ్, శ్రీకర్ మొదటి స్థానంలో, రాజపురం ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు రోహిత్, దిలీప్ రెండో స్థానంలో, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు త్రిలోచన, పవిత్రలు మూడో స్థానంలో నిలిచారు. వీరికి మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతిగా రూ.4 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు వారి ఖాతాల్లో జమ చేస్తామని మేనేజర్ మిశ్రా తెలిపారు. ఎంఇఒ ధనుంజయ మజ్జి విజేతలను అభినందించారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

పొందూరు : ధ్రువపత్రాలను అందజేస్తున్న అధికారులు

కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖరరావు, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, శిరీష, నాగరాజు, జ్యోతి కుమారి, అరుణ, సిఆర్‌పి తనూజ పాల్గొన్నారు.

పలాస: విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనడం వల్ల మేధాశక్తి పెరుగుతుందని ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని బ్రాహ్మణతర్ల జెడ్‌పి హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు బి.హేమంత్, ఎస్.ప్రణీత్ సాయిలు ఆర్థిక అక్షరాశ్యత అనే అంశంపై స్థానిక యూనియన్ బ్యాంకు ఆధ్వర్యాన నిర్వహించిన మండల స్థాయి క్విజ్‌లో ద్వితీయ స్థానం సాధించారు. వారికి వారు రూ.4 వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈ పోటీలకు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు కొయ్యల శ్రీనివాసరావు వ్యవహరించారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయిలో నిర్వహించిన రిజర్వ్ బ్యాంకు క్విజ్ పోటీల్లో తాడివలస జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంఇఒ పి.వి.రామరాజు, పి.రాజారావులు తెలిపారు. ద్వితీయ స్థానం పిల్లలవలస, తృతీయ స్థానం పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు సాధించాయి. ఈ పోటీల్లో కింతలి, పొందూరు, తాడివలస, లోలుగు, పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు పాల్గొన్నాయి. ప్రథమ స్థానాలకు రూ.5 వేలు, ద్వితీయ స్థానానికి రూ.4 వేలు,

పలాస : ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎంఇఒ శ్రీనివాసరావు

తృతీయ స్థానాలకు రూ.3 వేలు నగదు బహుమతులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస : యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలను విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని తొగరాం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన జి.దుర్గాప్రసాద్ గెలుపొందడంతో రూ.5 వేలు, కొర్లకోట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన డి.విమల గెలుచుకోవడంతో రూ.4 వేలు, పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ లక్ష్మీనగర్ విద్యార్థి గురుగుబెల్లి జ్యోతిక రూ.3 వేలు నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కె.వెంకటరమణ, కె.అప్పలనాయుడు, సిహెచ్.శ్రీనివాసరావు, బి.పాపినాయుడు, సిఆర్‌పి బొడ్డేపల్లి నర్సింగరావు, సిఎఫ్‌ఎల్ కో-ఆర్డినేటర్స్ చిగురుపల్లి వెంకటేష్, రామారావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ఆర్‌బిఐ ఫైనాన్షియల్ లిట్రసి ఆధ్వర్యాన నిర్వహించిన క్విజ్ పోటీల్లో పెద్దమడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు రూ.5 వేలు, కోసమాలకు జిల్లా పరిషత్ విద్యార్థులకు రూ.4 వేలు, మెళియాపుట్టి జెడ్‌పిహెచ్‌సి స్కూల్ విద్యార్థులకు రూ.3 వేలు నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

ప్రతి విద్యార్థీ ఆణిముత్యంలా ఎదగాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతి విద్యార్థీ ఆణిముత్యంలా ఎదగాలని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలానే ఉద్దేశంతో ప్రతి పాఠశాలలోనూ పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వం నగదు పురస్కారాలను అందిస్తుందని అన్నారు. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీని ఉపాధ్యాయులు కల్పించాలని సూచించారు. భవిష్యత్‌కు ఉపయోగపడే గొప్ప ఆస్తి విద్యని, దాన్ని పిల్లలకు అందించేందుకు సిఎం జగన్ కృత నిశ్చయంతో అందిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన దట్టి హర్షవర్ధన్, బతకల హేమంత్, బొమ్మాళి దీక్షకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతుల కింద రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున నగదును విద్యార్థులకు అందజేశారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు గొల్లపల్లి లక్ష్మణరావు, సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమామహేశ్వర రావు, పిఎంసి చైర్మన్ పాలిన పాపారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామల సింహాచలం అన్నారు. పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి మొదటి బహుమతి నీతుకు రూ.3 వేలు, ద్వితీయ బహుమతి గ్రీష్మరెడ్డికి రూ.2 వేలు, తృతీయ బహుమతి సాధించిన కన్నా బెహరాకు రూ.వెయ్యి చొప్పున నగదు, మెడల్, ప్రసంసాపత్రాలను అందచేసి అభినందించారు. కార్యక్రమంలో పేరెంట్స్

వజ్రపుకొత్తూరు : ప్రశంసాపత్రాలను అందజేస్తున్న శ్రీనివాసరావు

కమిటీ చైర్మన్ కె వెంకటరమణ (భీష్మ), ఉపాధ్యాయులు శివరామప్రసాద్ పాడి, కామరాజు, సూర్యం, జయలక్ష్మి, పద్మాబాయి, పద్మజ, బిందులత పాల్గొన్నారు.

బూర్జ : విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎ.పి.పేట సర్పంచ్ కె.వెంకటశివసాయి, సీతారామరాజు అన్నారు. కె.కె.రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలతి, మాజీ సర్పంచ్ కోరికన వెంకటరావు ఎస్‌ఎంసి చైర్మన్ గూన రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంతుల విధానం సాగు లాభదాయకం

ప్రజాశక్తి- పొందూరు

వరి పంట సాగు పద్ధతుల్లో వరి విత్తనాలను బంతులుగా చేసి నాటడం ద్వారా రైతులకు ఎంతో లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం నార్త్ కోస్టల్ రీజన్ శిక్షణ అధికారులు ప్రకాశరావు, హేమసుందరరావులు తెలిపారు. మండలంలోని తోలాపిలో వరి విత్తనాలను విత్తన బంతులుగా తయారు చేసి నాటు విధానంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి విత్తనాలను బంతులుగా చేసి పొడి నెలలో నేరుగా మొక్కకి మొక్కకి, వరుసకి వరుసకి 25 సెంటీమీటర్ల దూరంలో గుంతలు తీయాలన్నారు. అందులో కొద్దిగా ఘనజీవామృతం వేసి రెండు, మూడు విత్తన బంతులుగా చేసిన విత్తనాలను నాటాలని తెలిపారు. ఈ విధంగా చేయడం వల్ల తక్కువ

అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

మోతాదుల్లో విత్తనాలు సరిపోతాయి, విత్తనాల మొలకెత్తడానికి 12 శాతం నుంచి 15 శాతం తేమ ఉంటే సరిపోతుంది. చీడపీడలను తట్టుకుని మొక్క ఏపుగా పెరిగి మంచి పొద వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఎ గోవిందరెడ్డి, మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, యూనిట్ ఇన్‌ఛార్జి ఇ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రవికుమార్ పరామర్శ

బూర్జ : మండలంలోని కె.కె.రాజపురంలో టిడిపి నాయకులు, విశ్రాంత ఉద్యోగి కొరికాన లక్ష్మీనారాయణనాయుడు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఈయన వెంట టిడిపి రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు ఎ.రామకృష్ణ, సర్పంచ్ కె.సీతారాం ఉన్నారు.

చుక్కల మందును పంపిణీ చేస్తున్న సభ్యులు

చుక్కల మందు పంపిణీ

నౌపడ: వికాస తరంగణి సమితి ఆధ్వర్యాన దీర్ఘాయువు ఆయుర్వేద కేంద్రం ద్వారా నౌపడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వర్ణామృత ప్రాశన చుక్కలను సర్పంచ్ పిలక బృందావతి, రవికుమార్‌రెడ్డిలు వేశారు. చుక్కల మందుకు అంధవరపు సవరయ్య కుమారులు, గిన్ని నరసింహమూర్తి రూ.5000 చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ 16 ఏళ్లలోపు పిల్లలకు ఈ ఆయుర్వేధ ఔషధం వేయడం వల్ల జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. అలాగే రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అప్పలరాజు, ఉపాధ్యాయులు బాలరాజు, మార్కండేయ వికాస తరగిణి సభ్యులు పి.రవికుమార్‌రెడ్డి, వి.వాసుదేవరావు, బి.సోమశ్వరరావు, ఎన్.తిరుపతిరెడ్డి, విద్య కమిటీ చైర్మన్లు లింగరాజు, బాబ్జి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విత్తనాలను పంపిణీ చేస్తున్న నారాయణరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతు అభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు అన్నారు. మండలంలోని కనుగులవలసలో ఉన్న రైతు భరోసా కేంద్రం వద్ద సబ్సిడీతో కూడిన వరి విత్తనాలను సోమవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలను తీసుకువచ్చిన ఘనత గజన్‌కే దక్కిందన్నారు. రైతు భరోసా కేంద్రాలు రైతులకు బాసటగా నిలుస్తున్నాయని అన్నారు. సాగుకు అనుకూల విత్తనాలను, మేలైన సాగునీటి యాజమాన్య పద్ధతులపై ఆర్‌బికెల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. 1121, సాంబ, స్వర్ణ, 1064,1061 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయ కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్‌బాబు, కార్యదర్శి సీపాన హరీష్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ పి.సంతోష్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామల సింహాచలంకు ఎస్‌సి, ఎస్‌టి టీచర్స్ యూనియన్ నాయకులు బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. హెచ్‌ఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీకాకుళం, విజయనగరం ఉభయ జిల్లాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం అంబేద్కర్ తైలవర్ణ చిత్రాన్ని బహుకరించారు. తమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు సింహాచలం పాఠశాలను విద్యాపరంగా మరింతగా అభివృద్ధి చేయాలని, మరెన్నో ఉన్నత పదవులు పొందాలని సంఘ నేతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒ కె.అప్పారావు, జిల్లా అధ్యక్షులు

సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సోరి ప్రసాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు బొత్స జానకిరావు, వేమూరి సాగర్, వెంకట కరుణప్ప, విజయనగరం జిల్లా నాయకులు మట్ట అప్పారావు, శివప్రసాద్, రమణ, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.వెంకటరమణ (భీష్మ) పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి అభివృద్ధి పనులు వేగవంతం

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు అయిన స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి వేగవంతం చేయాలని జిల్లా దేవాదాయశాఖాధికారి ఎస్.చంద్రశేఖర్ ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణకు ఆదేశించారు. ఈ మేరకు ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులు బుధవారం పరిశీలించారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఆయనకు ఆలయ చరిత్రను అధికారులు వివరించారు.

చిత్రపటాన్ని స్వీకరిస్తున్న చంద్రశేఖర్

సాలిహుండంలో విత్తన గుళికల తయారీ

ప్రజాశక్తి- గార

మండలంలోని సాలిహుండంలో రైతులు, మహిళా సంఘ సభ్యులతో ప్రకృతి వ్యవసాయ రీజనల్ టీమ్ ప్రకాష్, హేమసుందర్‌లు వరిలో విత్తనా గుళికలను బుధవారం తయారు చేయించారు. ఈ విత్తన గుళికలు వరిలో జల్లితే సకాలంలో వర్షాలు కురవకపోయినా విత్తనం పాడువ్వకుండా ఉంటుందన్నారు. వరుసల పద్ధతిలో రుతు పవనలు తాకినప్పుడు వేసుకుంటే ఆ పంట నంబరు, డిసెంబరు నెలల్లో వచ్చే తుపాన్లకు గురికాకుండా ఉంటుందన్నారు. అలాగే రైతులందరూ నవధాన్య సాగును పూర్తి విస్తరణంలో చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో బాబాజీ, గోవిందరెడ్డి, లక్షుంనాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతులు

రైతులకు నిరంతం విద్యుత్ అందించాలి

సోంపేట: రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ లోవోల్టేజ్ సమస్యలపై అధికారులు దృష్టి పెట్టి పంటలు పండించుకునేందుకు ఉచిత విద్యుత్ నిరంతరం అందించాలని టి.శాసనం రైతులు కోరారు. ఇచ్చాపురం రైతు కులం ఆధ్వర్యాన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కులం కన్వీనర్ జన్నెల సూర్యవర ప్రసాదరావు , సోంపేట రైతు కులం అధ్యక్షులు బి.మదన్మోహన్, సలహాదారు రాంబుడ్డి గణపతి, దున్న సత్యం, మూల గోపాలకృష్ణ, ఆదర్శ రైతు వెదుళ్ల మాధవరావు మాస్టర్, టి.ఢిల్లీశ్వరరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

డబ్బులు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి- రణస్థలం

పంచాయతీలకు రావాల్సిన సంవత్సరం ఆరునెలల స్టాంప్ డ్యూటీల, సీనరీస్ డబ్బులను సర్పంచ్ ఖాతాల్లో తక్షణమే జమ చేయాలని రణస్థలం, లావేరు మండలాల సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు సబ్ రిజిస్టర్ వేణును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు రాష్ట్రంలో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకం వల్ల తమకు దక్కాల్సిన కనీస గౌరవమూ దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలకు రావాల్సిన ఫైనాన్స్ డబ్బులు కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకొని పంచాయతీల్లోకి జమ చేయాలన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించడానికి పంచాయతీ నిధుల్లో డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

పరిశీలిస్తున్న తులసీవరప్రసాదరావు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా...

కొత్తూరు : మండలంలోని దిమిలిలో కిడ్నీ వ్యాధిగ్రస్తులను నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కాన్సెప్ట్‌లో భాగంగా దిమిలిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో 30 మంది వరకు కిడ్నీతో బాధపడుతున్నారని, ఇటీవల కాలంలో నలుగురు మృతి చెందారని ఆయనకు వివరించారు. దీనిపై లోలుగెడ్డ మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈయనతో పాటు వైసిపి నాయకులు దారపు రామకృష్ణ, కొయిలాపు సంజీవరావు, రేగేటి కన్నయ్య వడమ శ్రీను ఉన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ శేఖర్

పక్కాగా ఓటర్ల జాబితా

కవిటి: ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలని, తేదీ 01.01.24 నాటికి 18 ళ్ల పూర్తయిన వారందరికీ కచ్చితంగా ఓటు హక్కు ఉండేలా చూసుకోవాలని ఇఆర్‌ఒ ఎం.సుమబాల, తహశీల్దార్ పి.శేఖర్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిఎల్‌ఒలు అప్రమత్తంగా ఉంటూ ఓటర్ల జాబితా సరిచూసుకోవాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూసుకోవాలన్నారు. తమతమ పరిధిలోని పోలింగ్ బూతులు సరిచూసుకుని, తమతమ పరిధిల్లో పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ టి.రామచంద్రరావు, ఎలక్షన్ డిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.